## క్లుప్తంగా

### అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ గడువు పెంపు



తెనాలి అర్బన్‌: అనధికార లేఅవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశాన్ని అక్టోబర్‌ 24 లోపు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తెనాలి మున్సిపల్‌ ఇన్‌ఛార్జి కమిషనర్‌ వీఎం.లక్ష్మీపతి రావు పేర్కొన్నారు. మున్సిపల్‌ కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఅవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని గతంలో ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ఈనెల 26వ తేదీతో గడువు ముగియడంతో దానిని అక్టోబర్‌ 24 వరకు పొడిగించిందని చెప్పారు. సమావేశంలో ఏసీపీ శివన్నారాయణ, ఆరోగ్యాధికారి డాక్టర్‌ యేసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

### పాస్టర్ల సంక్షేమానికి కృషి




తెనాలి అర్బన్‌: పాస్టర్ల సంక్షేమానికి తెనాలి టౌన్‌ పాస్టర్స్‌ అండ్‌ గాస్పెల్‌ వర్కర్స్‌ అసోసియేసన్‌ ఎంతో కృషి చేస్తుందని ఆ సంస్థ అధ్యక్షుడు బిషప్‌ కూచిపూడి అబ్రహం పేర్కొన్నారు. అసోసియేషన్‌ సమావేశాన్ని మంగళవారం రైల్వే ఇనిస్ట్యూట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాస్టర్లకు ఎటువంటి కష్టం వచ్చినా ఆదుకునేందుకు ముందు ఉంటామన్నారు. అలాగే వారి సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అందరూ ఐక్యతతో జీవించాలని సూచించారు. సమావేశంలో కార్యదర్శి రెవరెండ్‌ పల్లె శామ్యూల్‌, పాస్టర్‌లు కారుమూరి జక్రయ్య, లూథర్‌బాబు, పాల్‌ రాజు, బాలశౌరి, ఏలీషా బాబు, భానుప్రసాద్‌, యబ్బేజు, చిట్టిబాబు, స్టీఫెన్‌, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతతో చదివితే బంగారు భవిష్యత్‌



తెనాలి అర్బన్‌: విద్యార్థులు ఇష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల అధ్యక్షులు బొల్లిముంత అమరేశ్వరరావు పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌ డే వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. డిగ్రీ విద్యార్థులకు కూడా ఐటీ కంపెనీల్లో ఉన్నత ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కమ్యూనికేషన్‌ స్కిల్స్‌ డెవలెప్‌ చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్‌ చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తమ కళాశాలలో చదివిన విద్యార్థులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సమావేశంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ బొల్లిముంత శివరామకృష్ణ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విస్తరణపై విస్తృత సమావేశం



తాడేపల్లిరూరల్‌: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మంగళగిరి తెనాలి రోడ్డు విస్తరణపై మంగళవారం ఎంటీఎంసీ కమిషనర్‌ అలీమ్‌ బాషా స్థానిక వ్యాపారులు, మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ ఎంఎస్‌ఐడీసీ చైర్మన్‌ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మంగళగిరి నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేష్‌ ప్రణాళిక సిద్ధం చేశారని, దానిలో భాగంగా తెనాలి రోడ్డు విస్తరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ అధికారులు, చేనేత వ్యాపారులు, మత పెద్దలు పాల్గొన్నారు.

### కార్మికులకు సీపీఎం అండగా ఉంటుంది

తాడేపల్లిరూరల్‌ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్‌ ఫ్యాక్టరీ కార్మికులకు సీపీఎం అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని మంగళవారం సీపీఎం నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, సీఐటీయూ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్‌ నాయకులు కూరపాటి స్టీవెన్‌, ఆదినారాయణలు సందర్శించి మద్దతు తెలియజేశారు. వారు మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగేంత వరకు తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కార్మిక కుటుంబాలు ధైర్యంగా ముందుకు సాగాలని, 300 కుటుంబాలతో ముడిపడి ఉన్న ఈ సమస్యను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సుభాని, సూర్య ప్రకాశరావు, నాగేశ్వరరావు, సుబ్బారావు, కార్మికులు రమణమ్మ, శారద, సువర్ణకుమారి, భూలక్ష్మి, కాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కుబడిగా ‘పొలం పిలుస్తోంది’

- క్షేత్రస్థాయిలో వ్యవసాయ మినహా కనిపించని అనుబంధ శాఖల అధికారులు
- ఖరీఫ్‌లో రైతులకు పూర్తిస్థాయిలో అందని సలహాలు, సూచనలు
- అవగాహన లేక నష్టపోతున్న అన్నదాతలు



కార్యక్రమంలో కనిపించని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు

కొల్లిపర: ఖరీఫ్‌ సీజన్‌లో రైతున్నలకు పంటల సాగులో మెళకువలు, సస్యరక్షణ, అధిక దిగుబడి సాధించేందుకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్వహించే పొలం పిలుస్తోంది సదస్సులు ప్రస్తుతం ప్రతి గ్రామంలో మొక్కుబడిగా సాగుతున్నాయి. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరుకావడం లేదన్న విమర్శలు వినబడుతున్నాయి. నామమాత్రంగా కొన్ని చోట్ల కొన్ని శాఖల అధికారులు హాజరై కార్యక్రమం మొదలు పెట్టి మమ అనిపిస్తున్నారు. మరి కొంత మంది ఫొటో దిగి రైతులకు వ్యవసాయంలో ఎటువంటి సలహాలు, సూచనలు ఇవ్వకుండానే వెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**మమ అనిపిస్తున్న కార్యక్రమాలు..**

గ్రామాల్లో రైతులు ఎక్కువ శాతం చదువుకోని వారు ఉంటారు. వారికి సాగు చేసే సమయంలో వచ్చే సందేహాలను తీర్చి నాణ్యమైన మంచి దిగుబడులు సాధించేలా చైతన్య పరిచేందుకు వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమమే పొలం పిలుస్తోంది. అయితే రైతులకు ఈ కార్యక్రమాలను నామమాత్రంగా నిర్వహించడంతో పూర్తి స్థాయిలో సలహాలు అందడంలేదు. రోజుకు రెండు గ్రామాల చొప్పున ప్రతి వారం నాలుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరగాలి. వారంలో మంగళవారం, బుధవారంలో ఈ కార్యక్రమం నిర్వహించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించారు. అయితే మండలంలోని 20 రెవెన్యూ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించేందుకు మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్తున్నారు. అయితే కొల్లిపర మండలంలో మాత్రం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయాధికారులు వస్తున్నా.. అనుబంధ శాఖల వారు పూర్తి స్థాయిలో హాజరుకావడం లేదు.

**కనిపించని అధికారులు..**

వ్యవసాయ శాఖతో పాటు ఆత్మ, సెరికల్చర్‌, ఉద్యానశాఖ, పశుసంవర్ధకశాఖ, డైయిరీ డెవలప్‌మెంట్‌, కోపరేటివ్‌ ఫెడరేషన్‌, మార్కెటింగ్‌ శాఖ, ఇరిగేషన్‌, విద్యుత్‌, ప్రకృతి వ్యవసాయ తదితర సుమారు 10 శాఖల అధికారులు విధిగా పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు హాజరు కావాల్సి ఉంది. వాస్తవానికి ఒకటి, రెండు శాఖల అధికారులు మాత్రమే మొక్కుబడిగా వస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే అసలు ఆ రోజు పొలం పిలుస్తోంది కార్యక్రమం ఉంది అన్న విషయం కూడా ముందస్తుగా గ్రామంలో పచారం చేయడంలేదు.



ఒకరిద్దరు పాల్గొని రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారులు

**అన్ని శాఖలకూ సమాచారం ఇచ్చాం..**



ప్రతి వారంలో నాలుగు గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగే పొలం పిలుస్తోంది కార్యక్రమం గురించి ఉన్నత అధికారులకు ముందుగానే సమాచారం అందిస్తున్నాం. ఆయా షెడ్యూలు వివరాలను వ్యవసాయశాఖ, అనుబంధ శాఖలకు షెడ్యూల్‌ పంపించడం జరుగుతుంది. అయినా కొన్ని శాఖల అధికారులు హాజరు కావడంలేదు. దీనిపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందజేస్తున్నాం. వ్యవసాయశాఖ ద్వారా వీలైనంత వరకు రైతులకు అన్ని రకాల సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

– ఎన్‌.శ్రీనివాసరెడ్డి, ఏవో, కొల్లిపర మండలం

## స్వమిత్వ సర్వేతో చట్టబద్ధమైన భూమి హక్కులు

కొల్లిపర: గ్రామాలల్లో నిర్వహించే స్వమిత్వ సర్వే ద్వారా ఆస్తి యజమానులకు చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు కల్పించవచ్చునని ఈవోపీఆర్డీ భార్గవ్‌ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్‌ అసిస్టెంట్స్‌, ఇంజినీరింగ్‌ అసిస్టెంట్స్‌లకు స్వమిత్వ సర్వే ఫేస్‌ 2 గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాన కల్పించటానికి వచ్చిన వల్లభాపురం గ్రామ సచివాలయం–1 సర్వేయర్‌ కె.జగన్మోహనరావు మాట్లాడుతూ.. గ్రామాల్లో స్వమిత్వ ఈ సర్వేలో ప్రభుత్వ ఆస్తులు, గ్రామ సభ భూమి పార్శిళ్లు, వ్యక్తిగత ఆస్తులు, రోడ్లు, బహిరంగ ప్లాట్‌లతో సహా డ్రోన్‌ టెక్నాలజీని ఉపయోగించుకొని భూమి పార్శిళ్లను మ్యాప్‌ చేయడం ద్వారా ఆస్తి యజమానులకు చట్టబద్ధమైన యాజమాన్య ఆస్తి కార్డులు, టైటిల్‌ డీడ్‌లు జారీ చేయటం జరుగుతుందన్నారు. సర్వే జరిగే క్రమంలో గ్రామంలో ఏది గ్రామ కంఠం, ఏది ప్రభుత్వ స్థలాలు అనేది ముందుగా అధికారులకు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం సర్వే గురించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## • వేలంతో ఆదాయం.. వదిలేస్తే నిర్వీర్యం!



తెనాలి ఆర్టీసీ డిపో ఆవరణలోని గ్యారేజీలో పాడైపోయిన బస్సులు ఉన్నాయి. వీటి కాల పరిమితి పూర్తవడంతో ఆక్షన్‌ వేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు డిపో మేనేజర్‌ ఎ.రాజశేఖర్‌ లేఖలు రాశారు. అలాగే వీటి వెనుక ట్రాన్స్‌పోర్ట్‌ అధికారులు పట్టుకున్న ఆటోలు, మినీ వ్యానులు ఉన్నాయి. ఇవి క్రమేణ శిథిలావస్థకు చేరుతున్నాయి. అధికారులు స్పందించి వీటికి వేలంపాట నిర్వహిస్తే కొంత ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

– తెనాలి అర్బన్‌

## అనుబంధ విభాగాలు పటిష్టంగా పనిచేయాలి

డెప్యూటీ మేయర్‌ వనమా బాలవజ్రబాబు

పట్నంబజారు: ఏ రాజకీయ పార్టీకైనా అనుబంధ విభాగాలే పట్టుగొమ్మలని వైఎస్సార్‌ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, డెప్యూటీ మేయర్‌ వనమా బాలవజ్రబాబు(డైమండ్‌ బాబు) పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్‌ మస్తాన్‌వలి, డైమండ్‌ బాబును కలిసి చర్చించారు. ఈ సందర్భంగా డైమండ్‌బాబు మాట్లాడుతూ పార్టీ జెండాను భుజాకెత్తుకుని పాటుపడిన ప్రతి ఒక్కరికి సముచితస్థానం దక్కేలా అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటు ఉంటుందన్నారు. కష్టపడి పనిచేసి ప్రతి కార్యకర్తకి ప్రాధాన్యతనిచ్చేలా కమిటీలు ఏర్పాటు చేస్తామని వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్‌ మస్తాన్‌వలి మాట్లాడుతూ త్వరితగతిన కమిటీలు పూర్తి చేయాలని డైమండ్‌ బాబుకు విన్నవించటం జరిగిందన్నారు. అనుబంధ విభాగాల ఏర్పాటు ద్వారా పార్టీ మరింత బలోపేతం కానుందన్నారు.



డైమండ్‌బాబుకు విన్నవిస్తున్న మస్తాన్‌వలి పార్టీ నేతలు

# రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఏవో సుధీర్‌బాబు



రైతులకు జీవామృతం గురించి వివరిస్తున్న ఏవో శ్రీనివాసరెడ్డి

తెనాలి టౌన్‌: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు సూచించారు. మంగళవారం రూరల్‌ మండలం నేలపాడు, తేలప్రోలు గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో సుధీర్‌బాబు పాల్గొని వెద పెట్టిన పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని, నత్రజని, భాస్వరం, పొటాష్‌ ఎరువులను సిఫార్సు మేరకు వాడాలని వివరించారు. ప్రధానమంత్రి ఫసల్‌ బీమా యోజన పథకం కింద వరి, మినుము పంటలకు ఇన్సూరెన్స్‌ చేయించుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవ పెండింగ్‌ లిస్టులు రైతు సేవా కేంద్రాల వద్ద ప్రదర్శించినట్లు చెప్పారు. లిస్ట్‌లో పేరు ఉన్న రైతులు ఎన్‌పీసీఐ పెండింగ్‌ ఉంటే వెంటనే బ్యాంకుకు వెళ్లి ఖాతాకు లింక్‌ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

బొమ్మువానిపాలెం(కొల్లిపర): కౌలుకు సాగు చేస్తున్న ప్రతి రైతు తప్పని సరిగా కౌలు కార్డు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్‌.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. ప్రతి రైతు సాగు చేస్తున్న పంటలను ఆయా గ్రామాలలోని వ్యవసాయ సిబ్బంది ద్వారా పంట నమోదు(ఈ–క్రాప్‌) చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం ఎలా తయారు చేసుకోవాలి, జీవామృతం వల్ల పంటలకు కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈ మురళి, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

తాడేపల్లిరూరల్‌ : తాడేపల్లి పట్టణ పరిధిలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో కమిషనర్‌ లావణ్య వేణికి మంగళవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమశాఖ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు దయనీయమైన స్థితిలో ఉన్నారని అన్నారు. హాస్టల్‌ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌, కాస్మొటిక్‌ చార్జీలు పెంచాలని, సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో, శిథిలావస్థలో ఉన్న బిల్డింగ్‌ల్లో ఉంటూ భయాందోళనకు గురవుతూ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని వివరించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వార్డెన్‌, కుక్‌, వాచ్‌మెన్‌ పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్‌, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌.మహర్షి, రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

## వరుస వాహన చోరీలతో ప్రజలు బెంబేలు

ఫిరంగిపురం: మండలంలోని మునగపాడు గ్రామంలో రాత్రి సమయంలో వాహనాలు చోరీకి గురవుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ నెలలో వరుస దొంగతనాలతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇంట్లో స్థలం లేని వారు తమ వాహనాలను ఇంటి ముందు నిలిపి తాళాలు వేస్తున్నారు. రాత్రి సమయంలో దొంగలు వాటిని తీసుకువెళుతుండటంతో వేలాది రూపాయలు నష్టపోతున్నామని వాహనదారులు చెబుతున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని బతుకులని, నెల నెలా ఎంతో కొంత నగదు చెల్లిస్తూ వాహనాలు కొనుగోలు చేసి చిన్న వ్యాపారాలు, పొలం పనులకు ఉపయోగించుకుంటున్నామని అవి చోరీకి గురవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాల చోరీలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

# స్మార్ట్‌ మీటర్లను వ్యతిరేకించండి

సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు

తాడేపల్లిరూరల్‌: ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్‌ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో విద్యుత్‌ చార్జీలు పెంచితే వ్యతిరేకించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్‌ చార్జీలు తగ్గించకపోవడం విచారకరమని అన్నారు. మంత్రి నారా లోకేష్‌ గతంలో స్మార్ట్‌ మీటర్లు పగలగొట్టమని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. స్మార్ట్‌ మీటర్ల పేరుతో రూ.9 వేల నుంచి రూ.18 వేల వరకు విద్యుత్‌ వినియోగదారుల నుంచి వసూలు చేస్తారని అన్నారు. స్మార్ట్‌ మీటర్‌ బిగిస్తే పూటకో రేటు వసూలు చేస్తారని అన్నారు. స్మార్ట్‌ మీటర్ల బిగింపుకు వ్యతిరేకంగా ప్రజానీకం కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు వేముల దుర్గారావు, సీపీఎం, సీపీఐ నాయకులు పల్లె కృష్ణ, డి.వి.విజయ భాస్కరరెడ్డి, నీరుడు దుర్గారావు, తుడిమెళ్ళ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

# కేవీపీఎస్‌ మహాసభను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్‌: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్‌) గుంటూరు జిల్లా 6వ మహాసభ సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కేవీపీఎస్‌ నాయకులు తాడేపల్లి పట్టణ పరిధిలోని క్రిస్టియన్‌పేటలో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు–సామాజిక న్యాయం అనే అంశంపై 6వ మహాసభలో సదస్సు నిర్వహించనున్నామని, జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చిన తరువాత క్రైస్తవులు, దళితులు, మైనార్టీలపై దాడులు అధికమయ్యాయని అన్నారు. దళితుల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పే పాలకులు ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో హోం మంత్రి దళిత మహిళ అయినప్పటికీ ఆమె పెత్తందారులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. బాధితులకు అండగా కేవీపీఎస్‌ అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఈ సదస్సులో దళిత క్రైస్తవ మైనార్టీ యువతీయువకులు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్‌ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, వై.బర్నబాస్‌, మేరీ, కమలాకర్‌, నవీన్‌ ప్రకాష్‌ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కేవీపీఎస్‌నాయకులు

### పోషక విలువలు గల విత్తనాలు పంపిణీ

వేమూరు: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను చైల్డ్‌ రైట్స్‌ అడ్వకసీ పొండేషన్‌ క్రాఫ్‌ ట్రస్ట్‌ అంగన్‌వాడీ కేంద్రాలకు అందించడం ఆనందంగా ఉందని చైల్డ్‌ డెవలప్మెంట్‌ ప్రాజెక్ట్‌ అధికారి సీడీపీవో శ్రీలక్ష్మి తెలిపారు. వేమూరు మండలంలోని చైల్డ్‌ రైట్స్‌ అడ్వకసీ పొండేషన్‌ క్రాఫ్ట్‌ ట్రస్ట్‌ అధ్వర్యంలో గ్రామ బాలల రక్షణ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. చావలి, బలిజేపల్లి, కోడిపర్రు, పెరవలిపాలెం, వేమూరు, జంపని, వరహాపురం, పోతుమర్రు గ్రామాల్లో న్యూట్రీ కిచెన్‌ గార్డెన్‌ విత్తనాలను అంగన్‌వాడీ వర్కర్లకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌ రైట్స్‌ అడ్వకసీ పొండేషన్‌ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- గంబూసీయా చేపలను వదిలిన మున్సిపల్‌ ఛైర్‌పర్సన్‌ తాడిబోయిన రాధిక

తెనాలి అర్బన్‌: దోమల నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్‌ ఛైర్‌పర్సన్‌ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మలేరియా, ఫైలేరియా విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో చినరావూరు సత్యనారాయణ పార్కులోని చెరువులో గంబూసీయా చేపలను మంగళవారం ఆమె వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దోమను లార్వా దశలోనే అంతమొదించేందుకు గంబూసీయా చేపలు దోహదపడతాయన్నారు. దోమలు కుట్టడం వల్ల అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. మున్సిపల్‌ ఇన్‌ఛార్జి కమిషనర్‌ వీఎం.లక్ష్మీపతిరావు మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని మున్సిపల్‌ చెరువుల్లో గంబూసీయా చేపలను వదులుతున్నట్లు తెలిపారు. అలాగే మురుగు కాలువల్లో స్ప్రైయింగ్‌ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ ఇంటి పరిసరాలను నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కాలువల్లో వ్యర్థాలు వేయడాన్ని ఆపాలని సూచించారు. మున్సిపల్‌ ఆరోగ్యాధికారి డాక్టర్‌ ముప్పా యేసుబాబు, 15వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌ గుంటూరు కోటేశ్వరరావులు మాట్లాడుతూ.. ఒక గంబూసీయా చేప రోజుకు 180 నుంచి 300ల దోమల లార్వాలను తింటుందని తెలిపారు. వీటి వల్ల దోమల వ్యాప్తి తగ్గే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మలేరియా అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్‌, వంగల పున్నారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, జి.రవికుమార్‌, తదితరులు పాల్గొన్నారు.



చెరువులో చేపలను వదులుతున్న ఛైర్‌పర్సన్‌ రాధిక, కమిషనర్‌ లక్ష్మీపతిరావు

**పారిశుధ్య మెరుగుకు చర్యలు..**

తెనాలి అర్బన్‌: పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్‌ ఛైర్‌పర్సన్‌ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 25వ వార్డులో మంగళవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి ఆమె మాట్లాడారు. తెనాలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్‌ తాడిబోయిన రామయ్య, ఆరోగ్యాధికారి డాక్టర్‌ ముప్పా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌, తదితరులు ఉన్నారు. గాంధీ చౌక్‌లో మున్సిపల్‌ ఇన్‌ఛార్జి కమిషనర్‌ వీఎం లక్ష్మీపతిరావు పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ దావులూరి శ్రీనివాసరావు, తదిరులు పాల్గొన్నారు.



కాలువలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్‌ రాధిక, కౌన్సిలర్‌ రామయ్య

### మౌలిక వసతుల కల్పనకు కృషి

తెనాలి అర్బన్‌: రజక చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఐలమ్మ మున్సిపల్‌ పార్కులో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్‌ ఇన్‌ఛార్జి కమిషనర్‌ వీఎం.లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పార్కును పరిశీలించి అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. ముందుగా కంపోస్టు యార్డును పరిశీలించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్‌ ఉద్యోగులు ఉన్నారు.

### వరల్డ్‌ యూనివర్సిటీ గేమ్స్‌లో కేఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ



తాడేపల్లిరూరల్‌ : జర్మనీలో జరిగిన వరల్డ్‌ యూనివర్శిటీ గేమ్స్‌ 2025లో కేఎల్‌యూ విద్యార్థులు కాంస్య పతకాన్ని సాధించినట్లు యూనివర్శిటీ క్రీడల డైరెక్టర్‌ డాక్టర్‌ కె.హరికిషోర్‌ తెలిపారు. మంగళవారం తాడేపల్లి రూరల్‌ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు జర్మనీలో జరిగిన వరల్డ్‌ యూనివర్శిటీ గేమ్స్‌లో కేఎల్‌యూ నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొన్నారని, బ్యాడ్మింటన్‌లో పతకాలు సాధించారని అన్నారు. వైష్ణవి ఖడ్కేకర్‌ మిక్స్‌డ్‌ బ్యాడ్మింటన్‌లో ఏఆర్‌ రోహన్‌కుమార్‌ కాంస్య పతకం, మోహిత్‌ చౌదరి హాఫ్‌ మారథాన్‌లో 4వ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పతక విజేతలను ప్రొ.వీసీ డాక్టర్‌ కె.రాజశేఖరరావు, డాక్టర్‌ ఏవీఎస్‌ ప్రసాద్‌, డాక్టర్‌ ఎన్‌.వెంకటరామ్‌, రిజిస్ట్రార్‌ డాక్టర్‌ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్‌ కేఆర్‌ఎస్‌ ప్రసాద్‌, వ్యాయామ అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.